# కొత్త మనిషి

అజంతా శిల్ప సౌందర్యాన్ని తలదన్నేలా ఉన్న ఆ బొమ్మని పరిశీలనగా చూశాడు పరబ్రహ్మమూర్తి.

బాహ్యరూపంలోనే కాక ఆ బొమ్మ అంతర్ నిర్మాణంలోనూ ఎలాంటి లోపం కన్పించలేదతనికి.

అస్థిపంజరం, జీర్ణాశయం, వూపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండెకాయ, నవనాడులు, పంచేంద్రియ స్థానాలు—అన్నీ ఎక్కడివి అక్కడ అమరేయి. రక్తనాళాలు, సిరలు, ధమనులు, గ్రంథులు, టిష్యూలు ఇత్యాది సూక్ష్మాతి సూక్ష్మ భాగాలన్నీ ఎక్కడ ఏం అమరాలో అక్కడ అమరాయి.

అతను ఒక స్విచ్చిని ఆఫ్ చేసి మరోదాన్ని ఆన్ చేసేడు.

తలకాయ వరకు ఉన్న భాగాలు చర్మం లోపలి నుంచి కనిపించేయి ఇంతవరకు—ఇప్పుడు ఆ భాగం మామూలయింది. తలలోని భాగాల వద్ద ప్రకాశవంతమైన వో బల్బు వెల్గింది. ఆ సన్న సన్నని అరలుగా ఉన్న బుర్రలోని అనేక భాగాలు కన్పించసాగేయి. ఎన్నో కంప్యూటర్ల సముదాయంలా ఉందది.

ప్రతి ఒక్క భాగాన్ని అతి జాగ్రత్తగా పరీక్ష చేయసాగే డతను. దాని నిర్మాణంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ఇన్నేళ్ళ కృషి వ్యర్థమవుతుంది గదా!

మానవ నాగరికతలోని ప్రగతి విగతులకు మూల స్థావరం ఆ బుర్రే. మిగతా జీవుల నుంచి మనిషిని ఉన్నతుడిని చేసిన బుర్ర!

పక్క గదిలోని పాతకాలపు నాటి గోడ గడియారం ఒక్క గంటను కొట్టింది.

ఉలిక్కిపడి చేతి గడియారం చూసుకొన్నాడు మూర్తి.

క్రీస్తుశకం 2000–డిసెంబర్ 31–రాత్రి 11-30.

మరొక్క అరగంటలో పాత శతాబ్దానికి గుడ్‌బై–కొత్త శతాబ్దం ఆరంభమవుతుంది.

నూతన శతాబ్ది ఆరంభంలో మానవ జీవన ధోరణులలోనే మార్పు తెచ్చే వో శక్తి స్వరూపిణి అవిష్కారం–సైన్సు తెరిచిన విజ్ఞాన నాటికల ఫలంగా జరుగనున్న వో అపూర్వ సృష్టి!

గాజు జాడీలు, పరీక్ష నాళికలు, గరాటులు, వాయువాహకాలు, వాయుజాడీలు, గాజుకుప్పెలు—ఇత్యాది పాత్రలలో రకరకాల ద్రవాలు, వాయువులు, రక్తం ఉన్నాయి. ఏ విభాగం పని చేయాలనుకొంటే ఆ విభాగాన్ని పని చేయించేందుకు వీలుగా దేనికి దానికి స్విచ్చి లున్నాయి. అన్ని విభాగాలని కలిపి కంట్రోల్ చేసేందుకు వీలుగా వో మెయిన్ స్విచ్ ఉంది.

ఆ స్విచ్ నొక్కిన మరుక్షణంలో—

టెలిఫోన్ మోగింది.

"మిస్టర్ బ్రహ్మా! దిస్ ఈజ్ టైమ్—జస్ట్ ఈ శుభసమయంలో నీకు నా శుభాకాంక్షలు అందచేద్దామన్న కోరిక పుట్టి డిస్టర్బ్ చేసేను. ఆర్‌యూ రెడీ?" టెలిఫోన్‌లో గొంతు అంది.

"ఎస్—థేంక్యూ" పరబ్రహ్మమూర్తి అన్నాడు.

"నాకు అమిత ఉత్కంఠగా ఉందోయ్, బ్రహ్మా! ఇంతకీ నీ ప్రయోగం ఏమిటో, దేనికి సంబంధించో చెప్పేవు కాదు. అది లోకానికి తెలిపే సమయం ఆసన్నమయిందిగా? ఇప్పుడైనా చెప్పరాదూ నాకు?"

పరబ్రహ్మమూర్తికి అప్పుడుతోచింది—ఇన్నేళ్ళు తను ప్రయోగం చేసుకోటానికి తనకి సహాయం చేసిన ఆ వ్యక్తికి పర్సనల్‌గా కృతజ్ఞత చెప్పుకోటం తన కర్తవ్యమని.

"వన్ మినిట్, సర్. నేనే మీవద్ద కొస్తున్నాను."

ఫోను క్రెడిట్ చేసి అతను నాలుగు గ్లాస్ ఛేంబర్స్ తలుపుల్ని తెరుచుకొని సహజ వాతావరణంగల వో గదిలోకి వచ్చాడు.

అక్కడ వో వృద్ధుడు సిగార్ కాలుస్తూ సోఫాలో కూర్చుని ఉన్నాడు. అతను చాలా బలహీనంగా ఉన్నాడు.

"సత్యారావుగారూ! నమస్కారం! సార్. చుట్ట తాగవద్దని చెప్పేను కదా?"

"చుట్ట సంగతి అలా ఉంచు, బ్రహ్మా! పన్నెండు కావస్తూంది. నీ ప్రయోగం ఆరంభ సమయం ఆసన్నమయింది-నీ ప్రయోగం ఏమిటో నాకు తెలియదు. కానీ నీ ప్రయోగ ఫలితం విజయమవుతుందో, కాదోనన్న మానసిక ఆందోళనతో నాలో టెన్షన్ పెరిగిపోతూంది. ఆందోళనను పంచుకోటానికి మరొకరు లేరాయె. ఈ చుట్టే కదా నాకు తోడు? ఇంకా బతికి ఎవర్ని ఉద్ధరించాలి?"

పరబ్రహ్మమూర్తి గుండె ఆయనపై జాలితో ఆర్ద్రమయింది. ఎంత ఉన్నతుడు కాకపోతే తన ప్రయోగాన్ని గురించి తాను ఆందోళన చెందు తాడు? అసలు తనకి ఈ వసతులన్నీ కల్పించి ఈ ప్రయోగానికి ప్రోత్స హించింది మాత్రం సత్యారావు కాదూ!

"రావుగారూ! ప్రయోగం విజయవంతం కాదేమోనన్న ఆందోళన మీ కక్కర్లేదు. తప్పక విజయవంతమవుతుంది. మీ కోరిక, నా కోరిక కూడా తీరుతుంది."

"అంటే మానవజాతి జీవన దృక్పథం మారుతుందంటావా? స్వార్థం తగ్గి త్యాగం పెరుగుతుందా? కూటనీతులు, ద్వంద్వ ప్రవృత్తులు మాయ మవుతాయా? శాంతి కోసం యుద్ధ సన్నద్ధాలు చేసే తత్త్వం నశిస్తుందా? బలవంతుడిలో బలహీనుడిని దోచుకుందామన్న ధోరణి అంతర్ధానమవు తుందా? చాలా శుభవార్త, నాయనా! కానీ ఈ విషయం చెప్పవూ? ఇందు కోసం ఇంజక్షన్ కనిపెట్టావా? లేక ఏదన్నా చిన్న యంత్రాన్ని తయారు చేసేవా?"

"ఇవేవీ కాదండి-ఇలాంటివి ఏవి తయారుచేసినా అవి మళ్ళీ రాజ కీయ, ధనస్వాముల చేతుల్లో పేటెంట్లుగా మారి దుర్వినియోగం అయే ప్రమాదం ఉంది కదా? అందుకని....అందుకని....

"వూఁ....అందుకనీ ?"

"నా ప్రయోగం విజయవంతం అయిన మరుక్షణంలో ఆ రహస్యం మీకు కాక మరెవరితో చెప్పుకొంటాను, రావుగారూ ఆ ఆనందాన్ని నేనెవ రితో పంచుకోగలను? అంతవరకు ఆగలేరా? ప్లీజు.

"కానీ అంతవరకు నేను బతికి ఉండాలిగా మిస్టర్ బ్రహ్మ."

సత్యారావు దగ్గులో కల్సిపోయా యా మాటలు. అతను అయాసంతో రొప్పుతో సోఫా వెనక్కి వాలి నీరసంగా కళ్ళు మూసుకొన్నాడు.

అలా అతడిని చూస్తుంటే పరబ్రహ్మకు ఆ క్షణంలో కాలం స్తంభించి ఇరవై ఏళ్ళు వెనక్కి పోతున్న భ్రమ.

చిన్నప్పటి నుంచీ పరబ్రహ్మమూర్తి ఏకసంతగ్రాహి. చురుకుతనం, తెలివిగలవాడు. ఈడుకుమించి చదువుకుమించి ఆలోచించేవాడు. సైన్సు పుస్తకాలు, సైన్సు జర్నల్స్ అతని ఆహారం.

బిఎస్సీ చదువుతున్నప్పుడే జెనెటిక్ సైన్సును గురించి మాలెక్యూర్ టెక్నాలజీని గురించి మాట్లాడేవాడు.

బిఎస్సీ ఫైనల్ ఇయర్‌లో ఉండగా మెడిసిన్ పట్ల ఆకర్షితుడయ్యాడు. మెడిసిన్ మూడో సంవత్సరంలో ఉండగా క్రిష్టియన్ బెర్నాడ్ చేసిన గుండె ఆపరేషన్ వివరాలు తెలుసుకున్నాడు. రాబర్ట్ జార్విక్ ముందుగానే కృత్రిమ హృదయాన్ని మనుషులకు అమర్చవచ్చని దాని నమూనాని కాగితంమీద గీచి చూపించాడు. మధుమేహ రోగులకు ఉపయోగపడే ఇన్స్యులిన్ పంపింగ్ యంత్రాన్ని "చీప్"గా లభ్యమయ్యే రీతిలో సింపుల్‌గా తయారు చేస్తానన్నాడు.

కానీ అతని ఆలోచనలకు మేధావులు విలువనిస్తేనా? ఎగతాళి చేసేరు.

"నయం బాబూ టొమేటో మొక్క నుంచి ఏ విశ్వామిత్రుడి లాగో పొటేటోలు సృష్టిస్తానన్నావు కాదు.

ఆ ఎగతాళి ఫలితం పొమేటో మొక్క సృష్టి!

ఈ మొక్కకు పండే పండు సగం టొమేటో, సగం పొటేటో. కావాలంటే ఎక్స్‌పెరిమెంట్ చేసి చూపిస్తాను—అవకాశం ఇవ్వండి.

అతడి నో పిచ్చివాడి కింద క్రేక్ కింద పర్వెర్టెడ్ జీనియస్ కింద

పరిగణించేరే కాని ఎవరూ అతని మాటల్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఉత్త రాలు పిటీషన్లు చెత్తబుట్టల పాలయ్యాయి.

పరబ్రహ్మమూర్తికి ఏడుపు, కోపం, కచ్చ కలగలుపుకొని వచ్చాయి. విద్యా వ్యవస్థనూ, మేధావు లనబడే వారిని, రాజకీయాలని అందర్నీ కలిపి తిట్టేడు పబ్లిగ్గా.

అమెరికా వాళ్ళో, రష్యా వాళ్ళో ముందు ముద్ర వేస్తేకాని ఒకడి సత్తాని గుర్తించని దవుర్భాగ్యస్థితిలో ఉన్నది దేశం. అవినీతికి, స్వార్థానికి కుటిల నీతికి, ద్వంద్వ వైఖరులకు ఉన్న విలువ నీతికి, నిజాయితీకి లేదు. మనిషి భ్రష్టం చెందుతున్నాడు. ప్రకృతి విలువలను ధ్వంసం చేస్తున్నాడు. మనిషిని తిరిగి సృష్టించాలి. పునః సృష్టి జరగాలి. నేను కొత్తమనిషిని సృష్టిస్తాను.

కానీ డబ్బు?

పిచ్చివాడికి పిచ్చివాడు తోడైనట్టు పరబ్రహ్మమూర్తికి సత్యారావు తోడయ్యాడు.

సత్యారావు అప్పటికే ధనాన్ని తప్ప ఆత్మీయుల నందరినీ కోల్పోయేడు. పెద్దకొడుకు కుటిల రాజకీయాలకు, రెండో కొడుకు యుద్ధానికి బలి అయ్యారు.

అతనికి వైరాగ్యం కలిగింది—ధనాన్ని ఏదన్నా మంచిపనికి వినియోగించాలన్నది అతనికి మిగిలిఉన్న కోరిక.

పునః సృష్టి జరగాలంటున్నావు కదా? అది ఎలా సాధ్యం? విశ్వామిత్రుడికే సాధ్యం కాలేదే?"

"నాకు సాధ్యమవుతుంది. నన్ను నమ్మండి. నేను కొత్తమనిషిని సృష్టిస్తాను. మానవజాతి ధోరణిని మారుస్తాను."

"ఎలా?"

"అది అడగవద్దు. చెప్పేది కాదది. చేసి చూపిస్తాను."

"ఎన్నేళ్ళ కాలంలో?"

"నా కిప్పుడు పాతికేళ్ళు. నేను మరణించేలోగా సాధిస్తాను."

"సరే నీయాగాన్ని ఆరంభించు. నేను సైలెంట్ ఋత్విక్కుడినవుతాను.

అలా ఆరంభమయింది పరబ్రహ్మమూర్తి పరిశోధన.

అలారం గంట లాంటిది మోగింది. ఉలిక్కిపడ్డాడు బ్రహ్మ.

పన్నెండుకు మరో అయిదు నిముషాలు మాత్రమే ఉందనే దానికి సంకేతం అది.

"ఒక శతాబ్దం మారుతూంది. రావుగారూ ఒక శకమే మారబోతూంది. చూస్తారుగా?"

పరబ్రహ్మమూర్తి ముందుకు అడుగెయ్యబోయాడు.

"బ్రహ్మ" సత్యారావు కంఠం నీరసంగా పిలిచింది.

"ఆఖరి మాటకాదు, నా ఆఖరి కోరిక. ఎన్ని ప్రయోగాలు చేసినా, సైన్సు ఎంత అభివృద్ధి చెందినా ఎన్ని పరికరాలు కనుగొన్నా వీటన్నిటికి కేంద్రం మనిషి. వాటన్నిటి పరమార్థం మానవజాతి సౌభాగ్యం. ఆ మనిషి ఔన్నత్యాన్ని మానవజాతి విలువల్ని ధ్వంసం చేసే పరిస్థితి వస్తే మనిషిని యంత్రం జయించే ప్రమాదం సంభవిస్తే—నీ పరిశోధనా ఫలితాన్ని నీ చేతుల్తో నువ్వు ధ్వంసం చేస్తానని మాట ఇవ్వు బ్రహ్మ. నీ పరిశోధనా ఫలితాన్ని మరో ఆటంబాంబు కథగా మార్చనని హామీ ఇవ్వు"

"అలాగే రావుగారూ మాట ఇస్తున్నాను."

చేతిలో చెయ్యేసి ప్రమాణం చేసేదతను. చకచకా నడిచి వెళ్ళి గ్లాస్ చాంబర్‌లోకి ప్రవేశించాడు.

పాత సంవత్సరానికి వీడ్కోలిస్తూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ నగరంలో గంటలు మోగుతున్నాయి.

*　　　　*　　　　*

కంట్రోల్ స్విచ్ నొక్కి నొక్కగానే కొన్ని లక్షల వోల్టుల వెలుగుతో నిండిపోయిందా విగ్రహం. జీవధాతువుల్ని నింపుకొని చైతన్యంతో దీప్తి చెందసాగింది.

ఉన్నట్లుండి చీకటి___

ఆ చీకట్లో నుంచి అప్పుడే మాతృగర్భం చీల్చుకొని బయటకు వచ్చిన శిశువు ఏడుపు.

పరబ్రహ్మమూర్తి మొహం ఆనందంతో వెలిగిపోయింది. మొహానికి పట్టిన స్వేద బిందువులని ఎడమ చేతితో తుడుచుకొంటూ కంట్రోల్ బోర్డులోని మరో స్విచ్చిని నొక్కేడు.

"అమ్మ___మా___మాతః___మదర్" అదే భావం అనేక భాషల్లో వినబడింది.

"గుడ్! సక్సెస్‌ఫుల్. సెంట్ పర్సెంట్ సక్సెస్‌ఫుల్" అనుకొంటూ మరో మీట నొక్కాడు.

"వోం___శ్రీరస్తు___శుభమస్తు___వోం నమశ్శివాయ సిద్ధం నమః ఏ___ఫర్___ఏఎస్ ఎస్___ఏస్, బి___ఫార్___బివోయక్స్___బాక్స్, సి___ఫార్___సిఎటి___కేట్, డి___ఫార్___డివోయన్‌కెయివై___డాంకీ."

అనేక భాషల్లో ఇదే విన్యాసం చేస్తున్నది ప్రతిమ.

ఆ ప్రతిమ ఇప్పుడు ప్రతిమకాదు. జీవంతో నిండిన అయిదేళ్ళపిల్ల. స్విచ్ పానెల్‌లో వో బోర్డులోని స్విచ్‌లు మానసికమైన వయస్సును, అందుకు అనుగుణమైన జ్ఞానాన్ని ఆమెలో ప్రవేశపెట్టాయి. మరో బోర్డు లోని స్విచ్‌లు ఆమె శారీరక పెంపుదలకు తోడ్పడతాయి.

శారీరక పెంపుదలకు సంబంధించిన బోర్డులో వో బటన్ నొక్కాడు. ప్రతిమ వక్షోజాలు పరిపూర్ణంగా వికసించాయి. అందుతోబాటు శరీరంలోని ఇతర భాగాలలో కూడా మార్పులు వచ్చాయి. కానీ ప్రతిమ మొహంలో పదిహేనేళ్ళ కన్యలో ఉండాల్సిన భావనలు కన్పించలేదు.

అలా అతను స్విచ్‌లను జాగ్రత్తగా తగు విరామాన్నిస్తూ నొక్కుకుంటూ పోయాడు.

అతను నొక్కదల్చుకున్న ఆఖరి స్విచ్ అది.

ఆ బటన్ నొక్కితే ఆమె పాతికేళ్ళ కన్యగా పూర్ణయవ్వనంతో, అత్యద్భుతమైన మానసిక, శారీరక, మేధా సంపత్తితో నూతన సృష్టికి ప్రతీక అయి భాసిల్లుతుంది.

ఆ బొమ్మలో జీవాన్ని సృష్టించిన అరగంటలో ఆమెకు పాతికేళ్ళ వయసు, కన్యకు కావాల్సిన మానసిక శారీరక పరిణామాల నన్నిటినీ తను ప్రవేశపెట్టగలిగాడు. అంటే పాతిక సంవత్సరాల సహజకాలం ఈజు ఈక్వల్‌టు అరగంట మేషిన్ ఏజు!

అతను వో క్షణం ఆలోచించి పాతిక సంవత్సరాల బటన్ నొక్కాడు.

ప్రతిమ శరీరం ఒక్క రెండు నిమిషాల కాలం అనేక కొత్త మార్పులకు లోనయింది. అలాగే బుద్ధి కూడా! ఆ రెండు నిమిషాలలో ముందుగా పరబ్రహ్మమూర్తి అమర్చిపెట్టిన కంప్యూటర్ల ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సేకరించి మెదడులోని అరల్లో నిక్షేపం చేసుకొంది.

ఆ కార్యక్రమం పూర్తి కాగానే యంత్రాల చలనం ఆగిపోయింది.

నిశ్శబ్దం ఆవరించింది ఆ గదిలో. పరబ్రహ్మమూర్తి దృష్టి ఇప్పుడు కంట్రోల్ బోర్డు పైన జీవం లేని స్విచ్‌ల పైన లేదు. అతని దృష్టి పరిపూర్ణంగా చైతన్యవంతమైన ప్రాణం పోసుకొన్న ఆ శిల్పం మీద ఉంది. మనిషి సృష్టించిన మనిషి ఆమె!

ఆ నూతన వ్యక్తి ఇప్పుడేం చేస్తుంది? ఏం మాట్లాడుతుంది?

ఆమెకు తనింతవరకు నామకరణం చేయలేదు. ఆమె తన పేరు అడిగితే తనేం నామకరణం చేయాలి?

"మానవుడా ! వోయి మానవుడా!"

ఆ పిలుపునకు ఉలిక్కి పడ్డాడు పరబ్రహ్మమూర్తి. ఎక్కడో ఏదో పొరపాటు జరిగిపోయినట్లు కంగారుగా బోర్డు వైపు చూశాడు.

"నే నెవరిని మానవుడా ? ను వ్వెవరివి ? నన్నెందుకు సృష్టించావు ?" ఆమె నాలుగడుగులు ముందుకు వేసి, ఎవరో చెయ్యి పట్టి వెనక్కి గుంజినట్లు ఆగిపోయింది. వెనక్కి తిరిగి చూస్తే తనని కట్టి పడేసినట్లు ఉన్న అనేక వైర్లు!

బోర్డు వైపు చూసిన పరబ్రహ్మమూర్తికి జరిగిపోయిన స్వల్ప పొరపాటేమిటో అర్థమయిపోయింది.

రిలేషన్ షిప్స్‌ను అర్థం చేసుకొనే శక్తినిచ్చే వైర్ డిస్కనెక్ట్ కావటం వల్ల ఆ శక్తి ఆమె మెదడుకి అంది అందులో నిక్షేపం కాలేదు.

ఆమె ఆ గదిని, గదిలోని పరికరాలను, పరబ్రహ్మమూర్తిని ఒక్క క్షణం పరిశీలించింది. చిరునవ్వు నవ్వింది.

"వోయి సృష్టికర్తా! నాకంతా అర్థమయింది. ఈ రసాయనాలు, ఈ

కంప్యూటర్లు, ఈ వాయువులు, మొత్తం నీ ఈ ప్రయోగశాల నా కథను చెప్తోంది. నేను నీ ప్రయోగశాలకు పుట్టిన బిడ్డను. ఒక్కసారిగా పాతికేళ్ళు సంతరించుకొని పుట్టిన బిడ్డను.

పరబ్రహ్మమూర్తి ఆమె గ్రహణ శక్తికి ఆశ్చర్యపోలేదు. ఆ శక్తి అతను ఇచ్చినదే కదా!

"ప్రయోగశాలలో జన్మించిన నేను రాబోట్‌లాంటి కేవలం మర మనిషిని కాను. రక్తమాంసాలున్న మనిషిని. మరి నాకీ సంకెళ్ళు ఇంకా ఎంత కాలం సృష్టికర్తా ? నాకు స్వేచ్ఛ ప్రసాదించవూ?"

"ఎందుకు ప్రసాదించను ? కానీ అంతకుముందుగా నీ పేరేమిటో, నా పేరేమిటో తెలుసుకోవాలని లేదా నీకు?"

"పేరెందుకు? జీవించటానికి పేరంత ముఖ్యం కాదనుకొంటానే! పేర్లు మనుష్యులు ఏర్పరచుకొన్నవి. ప్రకృతి తాను సృష్టించిన వస్తువులు వేటికీ నామకరణం చేయలేదే! అంతెందుకు—నీ తల్లిదండ్రులు పెట్టిందాకా నీకు పేరు లేదుగదా?"

"అవును. పేర్లు మనుష్యులు తమ సౌలభ్యం కోసం, సులభంగా గుర్తించటం కోసం పెట్టుకొన్నవి."

"అంగీకరించావు కదా! మరి నా నామకరణం త్వరగా పూర్తి చేసి నాకు సంపూర్ణమైన స్వేచ్ఛను ప్రసాదించు."

"నీ పేరు ఉదయ జ్యోత్స్న—బాగుందా?"

"పేరు బాగుండాలా? ఆ బాగోగు లేమిటో నేనింకా గ్రహించలేకుండా ఉన్నాను. కానీ, పేరు చిత్రంగా లేదూ! ఉదయమంటే నిఘంటువుల ప్రకారం పుట్టుక, సృష్టి అని అర్థం. జ్యోత్స్న అంటే వెన్నెల, వెలుతురు, వెన్నెల రాత్రి అని అర్థం కదా! ఈ రెండు పదాలను ఎలా అన్వయిస్తావు?"

"ఈ భాషా చర్చ ఇప్పుడు ప్రధానమా?"

"కాదు. నన్ను ముందు ఈ లోకాన్ని చూడనివ్వు."

పరబ్రహ్మమూర్తి ఒక బటన్ నొక్కాడు.

ఉదయ జ్యోత్స్న శరీరానికి అంతవరకు కట్టేయబడ్డట్లు తగులుకొని ఉన్న అనేక వైర్లు వూడిపోయాయి.

ఉదయ జ్యోత్స్న చేతులు కాళ్ళు విదిలించుకొంది. చేతులు జాపి గిరగిరా తిరిగింది. పరబ్రహ్మమూర్తి వద్ద కొచ్చి అతని భుజంపై ఎలాంటి బెరుకూ లేకుండా చెయ్యి వేసింది.

దాదాపు ఇరవై సంవత్సరాలు ఒంటరిగా ఉన్న పరబ్రహ్మమూర్తి శరీరంలోని నరాలు స్త్రీ స్పర్శతో విద్యుత్తరంగాల్లా ప్రకంపించాయి. శరీరమంత ఏదో మత్తు, ప్రేమమత్తు!

"వెల్, మైడియర్ సర్! హఠాత్తుగా అలా అయిపోయావేమిటి? అవునూ ఇంతకీ నిన్నేమని పిలవాలి?"

"బ్రహ్మ"

"వో.... బ్రహ్మ! ది క్రియేటర్. సృష్టికర్తా. మంచిపేరే పెట్టారు మీ వాళ్ళు. కానీ, సృష్టికర్తకు తను సృష్టించిన మనుష్యులపై ఏలాంటి కంట్రోల్ లేదు. నువ్వు నా పైన ఏమైనా కంట్రోలును ఉంచుకొన్నావా?"

"లేదు. నేనూ బ్రహ్మలాగే స్వార్థపరుడిని కాను. కానీ నీ జన్మ రహస్యం, నీ మరణ రహస్యం కూడా నా చేతిలోనే ఉన్నాయి. అంతకు మించి నీ మీద నా కెలాంటి కంట్రోల్ లేదు. నీకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంది. నిన్ను సృష్టించిన ధ్యేయాన్ని నువ్వు నెరవేర్చగలవన్న నమ్మకంతో నీకు సంపూర్ణమైన స్వేచ్ఛనిచ్చాను. నువ్వు సర్వశక్తిమంతురాలివి. అయితే నీలో శక్తి తగ్గిపోతున్నదని తోచిన క్షణాన నువ్వు నా దగ్గరికి రావాలి. నీలో తిరిగి శక్తిని ఎలా ప్రవేశపెట్టాలో నా ఒక్కడికే తెలుసు."

"అంటే జబ్బు చేస్తే నయంచేసే డాక్టరులాంటి వాడివన్న మాట."

"నువ్వింతవరకు ప్రపంచాన్ని ఏమీ చూడకపోయినా ప్రపంచాన్ని గురించిన నాలెడ్జి నీకు చాలా ఉంది. ఇప్పుడు నిన్ను స్వయంగా ఈ మానవ ప్రపంచంలోకి తీసుకెళ్తాను. రా."

ఇద్దరూ గ్లాస్ చాంబర్స్ దాటి సత్వారావు ఉన్న గదిలోకి వచ్చారు.

"సర్! హియర్ ఈజు మై క్రియేషన్. నా క్రియేషన్ ఏమిటని అడిగారుకదా? స్వచ్ఛమైన మనిషి. యంత్రాలు, ఇన్‌జక్షన్‌లు, పిల్స్‌కాదు. చూడండి సార్ నేను మనిషినే సృష్టించాను."

చూడటానికి సత్వారావులో జీవం ఉంటేగా? అతనెప్పుడో విగత జీవుడయాడు.

*    *    *

ఉదయ జ్యోత్స్న చాలా స్వల్ప వ్యవధిలో ప్రపంచ సమస్యల నుంచి స్థానిక సమస్యల వరకు అన్నింటినీ అర్థం చేసుకొంది. మానవజాతి దృక్పథంలోనే, ఆలోచనా ధోరణిలోనే పెద్దలోపం ఉంది. ఆ లోపమే అన్ని రంగాలలో పేరుకుపోతున్న రుగ్మతలకు గల కారణం. రుగ్మతలు తగ్గాలంటే అసలు మవులికమైన ఆ లోపాన్ని సరి చేయాలి. మనిషిని ధార్మికుడిని చేయాలి.

కానీ ఎలా? ఏ రంగం నుంచి ఆ పని ఆరంభం చేసేటట్లు?

ఆమె ఏమి మాట్లాడినా జనం మంత్రముగ్ధులైనట్లు విరగబడి వింటున్నారు. ఏమి రాసినా విరగబడి చదువుతున్నారు. అస లామెను ఒక్కసారి చూస్తే చాలు ఆకర్షితులై పోతున్నారు.

ఆమె పాండిత్యం అపారం. ఆమె వాక్కు అమృతం. ఆమె నడవడి సకలజనులకూ ఆదర్శం. ఆమె శక్తి సంపద....వోహో!

"ఏ రంగంలోకి ప్రవేశించి జన జీవితంలో మార్పు తేవాలనుకొంటు న్నావు జ్యోత్స్నా!" వోరోజు ప్రేమగా అడిగాడు బ్రహ్మ.

కొన్ని నెలల్లోనే బ్రహ్మ గ్రహించాడు సత్యాన్ని.

తాను సృష్టించిన స్త్రీ మూర్తిని తాను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఆమె సాహచర్యాన్ని కోరుకుంటున్నాడు. కానీ ఆమె కూడా తనని ప్రేమించాలిగా?

ఆ విషయంలో మీరు సలహా ఇద్దామనుకొంటున్నారా?"

ఆమె ఎప్పుడూ ఇంతే. ఇతరుల మనసులోని మాటని భావాన్ని ఇట్టే గ్రహించేస్తుంది.

"వూ. నువ్వు ఏరంగంలో ప్రవేశించినా ఫర్వాలేదు. అయితే ఒక్క రాజకీయ రంగం జోలికి మాత్రం పోవద్దని నా సలహా."

"అదేం?"

అదేమిటో అతనికి తెలుసు కానీ—చెప్పకూడదు. చెప్పలేదు.

రాజకీయ రంగంలో వ్యక్తులు ఆమెకు మించిన శక్తియుక్తులు కలవారు. పైగా వారికిరెండురకాల శక్తులున్నాయి. ఒకటి దేన్నైనా నిర్మించ గల శక్తి. రెండవది దేనినైనా నిర్మూలించగల శక్తి. ఉదయ జ్యోత్స్నకు నిర్మించగల శక్తి హెచ్చు కాని నిర్మూలించగల శక్తి చాలా తక్కువ. అంతమంది రాజకీయ వ్యక్తులకున్న రెండు రకాల సమిష్టి శక్తి ముందు ఆమెకున్న ఒక్క రకం శక్తి ఎంతవరకు పని చేస్తుందో అతనికి తెలి యదు. ఆమె, తను ఇద్దరూ ఏకమవుతే కలిసి రాజకీయ శక్తిని ఎదుర్కొన గలరు. కానీ....

ఇద్దరూ ఏకం కావాలంటే తామిద్దరూ పెళ్ళి చేసుకోవాలి.

పెళ్ళి చేసుకోవాలంటే ఆమె తనని ప్రేమించాలి.

తను ప్రేమను ఎన్నిరకాల వ్యక్తం చేసినా ఆమెలో చలనంలేదేం? సకల శరీరధర్మాలు సహజంగా జరిగిపోతున్న ఆమె శరీరంలో ఏమీ లోపం లేదే?

"అదంతే" జవాబిచ్చాడు బ్రహ్మ.

జ్యోత్స్న నవ్వింది.

ఎంత మధురంగా ఉందా నవ్వు?

ఆ నవ్వు ఎప్పటికీ తన సొంతం కావాలి! తను సృష్టించిన స్వర పేటిక నుంచి వచ్చే ఆ శబ్దతరంగ మాధుర్యం తనదే కావాలి.

"నీకు రాజకీయాలంటే అలెర్జీ. ఆ రంగంలోని వ్యక్తులంటే నీకు చులకన భావన ఉంది. ఫలితంగా వారంటే కచ్చ—కోపం కదూ బ్రహ్మా! కానీ ఇంత తెలివి గలవాడివి, సృష్టికి ప్రతి సృష్టి చేయగల మేధావివి, ఒక్క విషయం ఆలోచించవేం? మానవుల మనోభౌద్ధిక శారీరక వ్యాపారాల నన్నింటినీ నియంత్రణం చేయగల శక్తి వారు ఏర్పరచుకొన్న సమాజానికి ఉంది. ఆ సమాజాన్ని శాసించగల శక్తి ప్రభుత్వం కుంది. ఆ ప్రభుత్వాలను కంట్రోల్ చేసేది రాజకీయ శక్తులే గదా! మరి దాని అర్థం ఏమిటి? మానవుడిని ఈరోజు మంచివైపు గాని చెడువైపుకాని తీసుకుపోతున్న ఒకేఒక్క శక్తి రాజకీయ శక్తి. శాసిస్తున్న శక్తి రాజకీయ శక్తి. ఆ రాజకీయ శక్తిని విస్మరించి మానవ జీవన ధోరణిలో ధర్మనిబద్ధత ను ఎలా నెలకొల్పగలవనుకొంటున్నావు? బ్రహ్మా! నేల విడిచి సాము చేస్తే ప్రయోజనం ఏమిటి? కనుక నేను రాజకీయ రంగంలోకి ప్రవేశించి మానవాళి నైతిక స్థాయిలో మార్పుతెస్తాను.

"వద్దు జ్యోత్స్నా! ఫలాన్ని నిషిద్ధ స్పృశించకు. బుద్ధుడు శంకరాచార్యులు వివేకానందుడు ఇత్యాది మహాపురుషులు రాజకీయాల ప్రసక్తి లేకుండా ధార్మిక జీవనంలో మార్పుతేలేదా?"

"తెచ్చారుకానీ శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, శివాజీ మహారాజు ఇత్యాది మహాపురుషులు ధార్మిక జీవనంలో మార్పుకు రాజకీయాధికారాన్నే ఆలంబనం చేసుకొన్నారు కదా? వారిని నేనెందుకు ఆదర్శంగా తీసుకోకూడదు?"

"తీసుకోవచ్చు. కానీ జ్యోత్స్న! నిన్ను సృష్టించిన నేను నీలో రెండు లోపాలున్నాయని ఆలస్యంగా తెలుసుకొన్నాను. ఆలోపాలు నాపొరపాటువల్ల వచ్చాయి నీలో. రాజకీయాల్లోకి నువ్వు ప్రవేశిస్తే నీలోని ఆ లోపాలనే రాజకీయవేత్తలు ఉపయోగించుకొని నీ పతనాన్ని కళ్ళజూస్తారేమోనని నాకు భయం ఉంది. అందుకే నీకు రాజకీయాలను నిషేదిస్తున్నాను. ప్లీజు....జ్యోత్స్న.

జ్యోత్స్న అతని కంగారు చూసి నవ్వింది.

ఆ నవ్వులో మాధుర్యం అతడిని మత్తెక్కించింది. విచలితుడిని చేసింది.

"జ్యోత్స్న. నీకేదన్నాజరిగితే నేను భరించలేను జ్యోత్స్న. అయ్ వాంట్ యూ అయ్ లవ్ యూ జ్యోత్స్న. నేను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకొని" అతను ఆమెను దగ్గరికి తీసుకుని ప్రేమ నిండిన కంఠంతో అన్నాడు.

ఆమె అతని ప్రేమకు ఏ మాత్రం చలించలేదు.

"ప్రేమ పెళ్ళి లవ్ నో మిస్టర్ బ్రహ్మ. నన్ను సృష్టించిన నీకు కూడా నా పట్ల స్వార్థం ఉంది కదూ! ఆల్ రైట్ బ్రహ్మ! అందుకు నేను నిన్ను నిందించను. కానీ నన్ను అనుభవించటానికి పెళ్ళిచేసుకోవాలన్న రూల్ ఉందా? నేను నిన్ను ప్రేమించాలన్న రూల్ ఉందా? నన్ను అనుభవించు—సిద్దంగా ఉన్నాను."

పరబ్రహ్మ బుద్ధి, మనసు, శరీరం కూడా ఆమె మాటలకు జుగుప్సతో నిండిపోయాయి. మొహాన్ని అయిష్టంగా పెట్టాడు.

"వో. మీ మానవజాతిలో పెళ్ళి అతిపవిత్రమైనది కదూ!" కానీ బ్రహ్మ. అన్ని మానవధర్మాలలోని మంచినే పెట్టి సృష్టించిన నాలో ఈ బంధుత్వాలను గుర్తించే శక్తి ఎంచేతలేదు?"

"నీ సృష్టిలో నా వల్ల జరిగిన పొరపాట్లలో అది మొదటిది" జ్యోత్స్న.

"మరి రెండోదేమిటి?"

"అదిప్పుడప్పుడే చెప్పను. చెప్పలేను. ఎంచేతనంటే ఇంకా నాలో ఒక ఆశ చావలేదు కనుక."

* * *

రాజకీయపు నిచ్చెనను జ్యోత్స్న అధిరోహిస్తున్న తీరు చూసి రాజకీయాలలో స్థిరపడిపోయిన వాడి గుండెల్లో బెదురు పుట్టింది.

ఒక్కొక్క మెట్టు కాదు. పదిపది మెట్లు కాదు. ఏకంగా వందల వేల మెట్లు, ఒక్కసారే ఎక్కిపారేస్తుంటే ఎలా? తమ గుత్తాధిపత్యం గతేమిటి? వంశాధిపత్యాలకు దిక్కేమిటి?

రహస్యంగా అంత ఏకమయ్యారు.

పైకి జ్యోత్స్న అవున్నత్యాన్ని భజిస్తూ, రహస్యంగా ఆమె లోపాల్ని వెదకసాగారు.

ఆమెకు ధన వ్యామోహం లేదు. స్వార్థ చింతన లేదు. లంచగొండితనం, ఆశ్రితపక్షపాతం, అలసత్వం, లాలసత్వం ఇత్యాది దుర్గుణాలు లేవు. ఆమె కష్టించి పని చేస్తుంది. ఆమెకున్న ఎనర్జీని చూచి నివ్వెర పోయారు. ఆమె నిజాయితీ ధర్మ దృష్టి వంకరులు లేనటువంటివి. ఆమెకున్న విషయ పరిజ్ఞానం అమోఘం.

ఇక ఏ నెపంతో ఆమెను అల్లరి చేసేట్లు?

హఠాత్తుగా ఆమె అందం గుర్తు కొచ్చిందందరికీ ! వయసులో ఉన్న స్త్రీ కదా ఆమె?

పాచికలు ప్రయోగించారు. నవమన్మధులలాంటి యువకుల్ని ఆమె పైకి ఉసిగొల్పారు.

ప్రేమచేష్టలు ఆమెపై పని చెయ్యలేదు. అయితే అందులో వో యువకుడు ప్రాణాలకూడా తెగించి ఆమెను పట్టుకొన్నాడు. కౌగిట్లో బంధించాడు. ముద్దుల వర్షం ఆమె శరీరంలోని వివిధ భాగాలపై కురిపిస్తూ ఆమె శరీరాన్ని ఉద్రేకపరిచాడు.

కామప్రకోపితమైన ఆమె శరీరం అతనికి లొంగింది.

* * *

లోకాన్ని కారు మబ్బులు ఆవహించి ఉన్నాయి. మూడురోజులుగా ముసురుపట్టి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది.

అసలే కొన్ని రోజులుగా ఉదయ జ్యోత్స్న శరీరం, బుద్ధి అస్వస్థంగా ఉన్నాయి. మూడురోజుల మబ్బులు, వర్షం ఆమెను మరీ బలహీనం చేసేయి. ఏదో చిరాకు ఆమెను ఆవహించింది.

పెళ్ళి చేసుకోకుండా ఒక పురుషుడితో శరీర సంపర్కం చెందటంతో ఆమెకు సహజత్వం కన్పించటం లేదు. అయితే ఆమెలోని ఆ బలహీనతను ఆధారం చేసుకొని శత్రువులు విజృంభించారు. ఆమెకు జనంలో వ్యతిరేకతను సృష్టించారు.

"కామం మనిషికి ఆకలి లాగా ప్రకృతి సిద్ధమైనది. ఆకలి తీర్చుకొన్నట్టే దానిని తీర్చుకోవటంలో తప్పేమిటో నాకు కన్పించటం లేదు. ఆమె జనానికి వివరించబోయింది.

"ఛీ ఛీ."

జనానికి ఆమె పట్ల ఆకర్షణ తగ్గిపోయింది. ఆమె చెప్పే మంచి మంచి మాటలకు విలువపోయింది. ఆమె కష్టపడి చేసే సేవా కార్యక్రమాలు సైతం జనాదరణను పొందలేక పోతున్నాయి.

"చెప్పేవి శ్రీరంగనీతులు. దూరేవి" అన్నట్లుంది ఈమె ధోరణి.

జనంలో విసుగును గమనించి రాజకీయవేత్తలు జ్యోత్స్న ఆధిపత్యాన్ని వివిధ రంగాలలో కూలదొయ్యటానికి పూనుకొన్నారు.

ఆకర్షణ తగ్గిపోతే తను ఏమీ చెయ్యలేనని జ్యోత్స్నకు తెలుసు. కానీ తగ్గిపోతున్న ఆకర్షణను ఎలా పునరుద్ధరించుకొనేటట్లు?

ఆమె ఆలోచనతో సతమతమవుతుంటే ఈ వర్షం, ముసురు.

ఆ రాత్రి ఆమె మరింత నీరసాన్ని ఫీల్ అయింది.

పరబ్రహ్మమూర్తి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

అతని వద్ద కెళ్తే? ఈ అస్వస్తతను కుదిరిస్తాడా?

ఆమె లేవబోయింది. కానీ సాధ్యం కాలేదు వో పట్టాన. శరీరమంతా చల్లగా మంచు ముద్దలా అవుతున్నట్లు ఆమె గుర్తించింది.

జ్వరమొస్తే టెంపరేచర్ పెరగాలి. కానీ తనకు తరుగుతున్న దేం?

ఆమె మెల్లగా పాకుకుంటూ ఫోను వద్ద కెళ్ళింది.

* * *

"టేక్సీని త్వరగా పోనివ్వమను బ్రహ్మ" జ్యోత్స్న నీరసంగా అంది.

ఆమె శరీరం అతని చేతులకి చల్లగా తగులుతూంది.

ఆమె అంత త్వరగా చావదని అతనికి తెలుసు. తను కావాలనుకొంటే ఆమెను బ్రతికించగల సత్తా కూడా తనకుందని తెలుసు.

కానీ ఆమెను బ్రతికించటమా, చంపటమా?

ఆమెను తను సృష్టించిన ప్రయోజనం వేరు. కానీ ఒక్క చిన్న పొరపాటువల్ల తన ధ్యేయం తలకిందులయింది.

భుజించ వద్దన్న నిషిద్ధ ఫలం చేత ఆనాడు ఈవ్ ఆకర్షితురాలైనట్టే ఈనాడు జ్యోత్స్న కూడా నిషిద్ధఫలం చేత ఆకర్షితమయింది.

తన చేటు కొనితెచ్చుకోటమే కాక తన సృష్టి ప్రయోజనాన్నే భగ్నం చేసింది.

ఆమెకు తానిప్పుడు గర్భవతి నన్న విషయం తెలియదు. ఆమె కడుపులో పెరుగుతున్న జీవానికి బీజం ఒక భ్రష్టుడిది. అధార్మికుడిది. మరి ఆ బీజ ఫల రూపం ఎలా ఉంటుంది?

టాక్సీ ఆగింది.

"నా శరీరం చల్లబడి పోతూంది బ్రహ్మా. నేను భరించలేకుండా ఉన్నాను. నా జబ్బేమిటో నన్ను సృష్టించిన నీకు తెలుసు. అది కుదిర్చి నన్ను రక్షించు బ్రహ్మా."

"జ్యోత్స్న, నీకు బతకాలన్న కోరికగా ఉందా? మరణమంటే అందరు మనుష్యుల్లాగే భయపడ్తున్నావా?"

"తప్పా? చరలొద్దు బ్రహ్మా. నన్ను బతికించు."

ఆమెను లేబొరేటరీలోకి తీసుకెళ్ళాడు బ్రహ్మ.

"నిన్ను నేను సృష్టించిన ప్రయోజనం నెరవేరలేదు. అయినా నువ్వెందుకు బతకాలను కొంటున్నావు జ్యోత్స్నా?"

"నాకు తెలియదు కానీ నాకు బతకాలనే ఉంది"

"జీవితం మీద నీకు అంత ప్రేమ కలగటానికి కారణం ఏమిటో తెలుసుకోవా? నువ్వు నిన్ను అనుభవించిన అతడిని ప్రేమిస్తున్నావా?"

"లేదు. నేను ఆ అనుభవాన్ని వాంఛిస్తున్నాను. అసలు ప్రేమంటే ఏమిటి బ్రహ్మా! ఆ మాట విన్నానే కాని అనుభవంలోకి రాలేదు. అదే కనుక తెలిస్తే నిన్నే ప్రేమించక పోయానా?"

"నా సృష్టిలో జరిగిన రెండో పొరపాటు అదే జ్యోత్స్నా. మానవ శరీర నిర్మాణంలో గల అన్ని అవయవాలని ధాతువులని నీలో సృష్టించ

గలిగాను. కానీ మనసు అన్న పదార్థాన్ని నీలో సృష్టించలేక పోయాను. మనసు లేని నువ్వు రక్తమాంసాలున్నా రాబోట్ లాంటి యంత్రంతో సమానమే. కనుక నువ్వు బతకాల్సిన అవసరం ఇక లేదు. నిజానికి నీ చావు లోకానికి మేలు చేస్తుంది. ఎంచేతనంటే నీ శక్తిని రాజకీయ నాయకుల వికృతత్వానికి సంతరించుకొని నీ కడుపులో పెరుగుతున్న బిడ్డ ఈ ప్రపంచానికి మరింత హాని చేయగలడు. మూడు రోజుల సూర్యరశ్మి సోకక పోవడంవల్ల నీ శక్తి అంతరించి పోతూంది. నా సృష్టిని నేను అంతం చెయ్యాల్సిన అవసరం లేకుండా ప్రకృతే అంతం చేస్తూంది. కొత్త మానవుడి సృష్టికి పునరంకితానికి చేస్తాను నా జీవితాన్ని. అతని మొహంలో విరిసిన నవ్వు చూసి ఆమె భయంతో జీవరహితురాలయింది.

(ఆంధ్రప్రభ వారపత్రిక 7-9-83)